# ధనం ! - ఇంధనం !

నేటి సంఘజీవికి కావలసినదల్లా ధనం! అదే మనిషికి ఇంధనం! ఆక్సిజన్ లేక పోయినా బ్రతకవచ్చేమోగాని డబ్బు లేక పోతే క్షణం గడవదు. మానవుడి అవసరాలు... విలాసాలు.. అన్నీ ధనంతోటే ముడిపడి వున్నాయి. కదూ..." సాయం సమయాన నడుస్తున్న రామనాథం తలపక్కకు తిప్పి నాముఖంలోకి చూస్తూ అన్నాడు.

"అవును మరి! అవసరాలు మితిమీరినయ్. డబ్బే సర్వస్వం అయింది! డబ్బు కోసం నానా అగచాట్లు పడుతున్నారు. మొక్కలకు నీరు పోసి పెంచినట్లు అవినీతిని సర్వవేళలా సర్వావస్థలయందూ పోషిస్తోంది మానవాళి!..." రామనాథంలో నా అభిప్రాయం నేను వ్యక్తపరిచాను.

ఇక నడవలేక ఫుట్‌పాత్ మీద వున్న సిమెంట్ బెంచీ మీద చతికిలపడ్డాం!

"జీవితావసరాలకు మించి ఆర్జించాలనుకోవటం, అవినీతి పన్లకు పాల్పడటం.. తప్పురా.. మనిషి పతనానికి అదినాంది!..." ముఖాన వున్న స్వేదబిందువులను పైనున్న కండువాతో తుడుచుకుంటూ మాట్లాడాడు రామనాథం.

రామనాథం, నేను ఒకే డిపార్టుమెంట్లో ఒకేసారి చేరాం! ఇద్దరిదీ ఒకే వూరు. అది కుగ్రామం. మావి కలిగిన కుటుంబాలు కావు. ఆర్థికపరమైన ఇబ్బందులను అధిగ మించగల శక్తి లేకపోవటంతో ఇద్దరం డిగ్రీ చదువుతో ఆపేశాం.

ఉద్యోగాన్వేషణ మొదలై.. సిటీ చేరుకున్నాం! ఇద్దరం కలిసి సింగిల్ రూమ్ అద్దెకు తీసుకుని సెల్ఫ్ కుకింగ్ మొదలుపెట్టాం! ఉదయం నేను, రాత్రికి రామనాథం వంట చేసేట్టని ఒప్పందం కుదుర్చుకున్నాం.

ఉద్యోగాలొచ్చాయి. వివాహాలు అయినాయి. సంసారం... సంతానం.. బరువులు... బాధ్యతలు... జీతాలు చాలకపోవటం... అప్పులు చేయటం.. అంతా వరుస క్రమంలో జీవితాలు నడిచి ఎట్టకేలకు సూపరేన్యుయేషన్ మీద రిటైరైనాం.

మా ఇద్దరిదీ ఒకటే మనస్తత్వం! అవసరాలు తీరటంకోసం అనేక మార్గాలు అన్వేషించాం! అయితే లంచావతారాలుగా మారలేదు.అవినీతిని అసహ్యించుకున్నాం!

అవినీతి ఒడిలో గారంపోతూ ముద్దులు కుడిచే వారికి దూరంగా వుంటూ వచ్చాం. ఇద్దరం సర్వీసులో వున్నన్నేళ్లూ సిన్సియర్ అడ్ అనెస్ట్‌గా బతికాం! గర్వంతో కాలరెగరేశాం.

విత్తం కోసం 'చిత్తం చిత్తం' అంటూ వొంగి వొంగి సలాములు చేసేవారున్నారు. అవినీతి తిమింగిలాలను చూశాం!

పట్టుబడినవారు దొంగలైనారు. లేని వాళ్లు దొరలుగా చెలామణి అవుతున్నారు.

ఒకరితో మాకు పోలిక లేదు. పోటీలేదు. మా ప్రిన్స్‌పుల్స్ మావి అనుకునే జీవనయాత్ర సాగించాం.

మనిషై పుట్టిన ప్రతి వారికీ డబ్బుకు గల ప్రాముఖ్యం తెల్సు! డబ్బు అవసరాలమీద, అనర్థాలమీద బోలెడన్ని సినిమాలొచ్చాయి.

ఏది ఏమైనా... డబ్బుకున్న విలువ బహుదొడ్డది.

డబ్బుకి మారుపేర్లు కోకొల్లలు! తైలం... విత్తం... వగైరా వగైరా...

"ఇప్పుడు ప్రతి అంట్లవెధవాయ్ దగ్గరా డబ్బు మూలుగుతోంది. అది వైటో...బ్లాకో..? రైటో... రాంగ్ రూట్లో సంపాదించిందో?... వారి వారి అంతరాత్మలకు తెలియాలి. వక్రమార్గాల్లో పయనిస్తూ అక్రమంగా ఆర్జించడం ఫ్యాషనైంది. కదూ?..." ఈ మాటలు రామనాథం నోటి నుండి రావటం నాకు కొత్తేమీ కాదు.

అవినీతి గురించి మేమిద్దరం వివిధ రకాలుగా చర్చించుకోవటంలో థ్రిల్ ఫీలవుతుంటాం.

"నీకు తెలుసో తెలీదో రామనాథం... నేడు బెగ్గర్స్ దగ్గర సైతం లక్షలు...కోట్లు మూలుగుతున్నాయి. బెగ్గర్స్ ఆ మధ్య రెండు తెలుగు సినిమా నిర్మాతలుగా మారారని పేపర్లో చదివాను" అనటంతో నా వేపు ఆశ్చర్యంగానోరు తెరచి చూశాడు.

"సంపాదనకు నేడు అనేక మార్గాలున్నాయ్. దొంగతనం...రౌడీయిజం... దళారీతనం.. లంచం... వగైరాలు... అద్సరేగాని.. ఆ మూడు చక్రాల బండి నడుపుకుంటూ వస్తున్నాడే...వాడ్ని చూడు! ఒక్క చోటే వుండి అడుక్కు తింటే కలక్షన్ పూర్‌గా వుంటుందని,వికలాంగుల పథకం క్రింద ఇవ్వబడిన ఆమూడు చక్రాల బండిలో వీధుల్లో తిరుగుతూ అడుక్కుంటున్నాడు. వీడికి ముగ్గురు భార్యలు... అరడజను మంది సంతానమట! పాత బస్తీలో వీడికో మేడ కూడా వుందిట! అదీ వాడి స్థాయి! మనమూ వున్నాం దేనికీ?.. మన బతుకులకు పెన్షన్ సదుపాయం లేదు కదా? పుత్రుల దయా భీక్ష మీద జీవిత చరమాంకాన్ని వెళ్లదీస్తున్నాం!..."

నేను నివారించకపోతే రామనాథం తన ఉపన్యాసాన్ని గంటల తరబడి ఇస్తూ నన్ను విసిగిస్తుంటాడు.

చక్రాల బండివాడు మమ్ముదాటి పోయాక ఒక సీనియర్ సిటిజన్... మనిషి నీట్‌గానే ఉన్నాడు... మా ముందుకొచ్చి నిలబడి మా ముఖాల్లోకి చూచి జాలిగా ముఖం పెట్టి 'సార్... వన్ రూపీ...సార్ వన్‌రూపీ' అంటూ అరిగిన గ్రామ్‌ఫోన్‌లో పాటలాగే చెప్పిందే చెప్పటం చూసి నివ్వెరపోయాం.

"తిండికి గతిలేక ముష్టెత్తుకోవటం లేదుసార్! వంశపారంపర్యంగా వస్తున్న ముష్టెత్తుకునే బతుక్కి గుడ్‌బై చెప్పలేక చేతులుచాస్తున్నా సార్..." అన్నాడు.

ముష్టి అంటాడు.. వంశపారంపర్యం అంటున్నాడు... విషయం మాకు అంతు చిక్కక మేమిద్దరం ఒకరి ముఖాలొకరం చూసుకున్నాం.

"మా సర్‌నేమ్ ముష్టివారు సార్! యాచన మా వృత్తి. మాకు సిగ్గు బిడియం వుండదు. నేనూ ఎడ్యుకేటెడ్ సార్. నలభైయేళ్లు పెన్షన్ లేని ఉద్యోగం చేశాను. ఇప్పుడు రోజూ సంపాదించేది తీసుకెళ్లి కోడలి దోసిట్లో పోస్తేగాని కూడు పెట్టదు. నా భార్య చనిపోయిననాటినుండీ బాధలు మరీ ఎక్కువైనాయి సార్..." అతని కళ్లు చమర్చాయి.

అతగాడి జాలి గాథ విన్న మా హృదయాలు ద్రవించాయి. చెరొక రూపాయి బిళ్ల అతగాడి దోసిట్లో వుంచగానే ముందుకు సాగిపోయాడు.

"ఒరే రామనాథం! వాడికీ మనకూ తేడా ఏమిట్రా?.." ప్రశ్నించాను.

"వాడు చేయిచాచి నోరు విప్పి ముష్టెత్తుకుంటున్నాడు. మనమా పనిచేయలేక నిస్సహాయంగా .. ఇదిగో ఇలా బ్రతుకు తున్నాం.."అంటూ సింపుల్‌గా రెండే రెండు మాటల్లో చెప్పాడు.

వాడి జవాబు నాకు నచ్చింది.

రామనాథానికి ఇద్దరాడపిల్లలు. అత్తారిళ్ల కెళ్లిపోయారు. నాకు ఇద్దరు మగవెధవలు. సంపాదనపరులే అయినా...'అయ్యో పెన్షన్ లేని పూర్ ఫాదర్ చేతిలో డబ్బు లేక నానా అవస్థలు పడుతున్నాడేని జాలిపడి సానుభూతితో నా ఖర్చులకంటూ నెలకో నాలుగొందలు ఇస్తే ఎంత బావుండు?.. అనుకుంటాను-వాళ్లకు చదువులనీ, సంధ్యలనీ.. పాకెట్‌మనీ అంటూ వాళ్లు అడక్కుండానే ఇచ్చే వాడివి కదా... వాళ్లు సంపాదన పరులైనతర్వాత గతం మరిచారు. ప్రతి అవసరానికి పిల్లలను ముష్టెత్తాల్సిన అగత్యం నాకేర్పడ్డందుకు నన్ను నేను నిందించుకుంటాను.

రామనాథం పరిస్థితి మరీ దారుణం! కూతుళ్ల దగ్గరకు వెళ్లనూలేడు. అల్లుళ్లను నోరు తెరచి అడిగే పరిస్థితీ కాదు.

మూడో కంటికి తెలీకుండా అవసరాలకు ఇంట్లో పాత సామానంతా ఒక్కొక్కటిగా అమ్ముతూ వచ్చాడు.

భార్యమెడలో పుస్తెలు తప్ప అమ్మటానికేం మిగల్లేని దుస్థితి వారిది!

పోనీ ఏదైనా వృద్ధాశ్రమంలో చేరదామనుకుంటే... అందుక్కూడా డబ్బు కావాలి గదా! ఓల్డేజ్ హోమ్స్ సైతం వ్యాపార ధోరణిలో నడుస్తున్నప్పుడు రామనాథం లాంటి వారి బ్రతుక్కి దారేది?

పోనీ ఇప్పుడు కష్టించి ఏదో పది డబ్బులు సంపాదించటానికా... వంట్లో శక్తి సన్నగిల్లింది. కంటి చూపు మందగించింది.

ఈ మధ్య రామనాథం రెగ్యులర్‌గా గుడికి వెళ్లటం గమనించాను. ఈ వయసులో వాడికి భక్తి పట్ల దృష్టి మళ్లిందేమో అనకున్నాను.

మనిషికి చాలినంత దేవుని ప్రసాదం లభించదు కదా?

దైవ ప్రసాదం సైతం అమ్మిసొమ్ము చేసుకుంటున్న రోజులాయె?

ప్రసాదం కొనుక్కుని అయినా తనూ భార్య కడుపు నింపుకోవాలీ అంటే... అందుకు డబ్బు కావాలి!.

తన వద్ద లేనిదే ధనం! ఇక ప్రసాదాన్ని మాత్రం ఎలా కొనటం?-

ఒక రోజు యోచిస్తూ గుడిమెట్లమీద నిలబడిన రామనాథం దోసిట్లో సాక్షాత్కరించిన పది రూపాయల నోటుని చేతి వేళ్లతో పట్టుకుని అటూ ఇటూ తిప్పి చూశాడు.

అంతా విష్ణుమాయగా తోచింది. తాను ముష్ఠివాడుకాదు. అయినా దయగల భక్తుడు తనను అడుక్కునేవాడుగా భావించి, పది రూపాయలు దానం చేశాడు.

గుడిలో దేవుడు తనను ఈ విధంగా కనికరించి నందుకు చేతులు జోడించి నమస్కరించాడు.

ఆ పదిరూపాయలతో ప్రసాదం కొంటే ఒక పూట తనకూ, భార్యకీ తిండి గడుస్తుంది.

కానీ... అలా చేయటానికి రామనాథానికి మనస్కరించలేదు.

తనకు ముష్ఠిబతుకు అక్కర్లేదు. ఇతరుల దయాదాక్షిణ్యాల మీద బ్రతకటానికి రామనాథం మనస్సాక్షి వప్పుకోలేదు.

అందుకే ప్రసాదాలు అమ్మే కౌంటర్ వైపు వెళ్లకుండా.. దేవుడి హుండీ వేపు రామనాథం కాళ్లు నడిచినయ్?

భక్తుడిచ్చిన పదిరూపాయల నోటుని దేవుడి హుండీలోవేసి తనను ఆదుకోమని ఆ పరమాత్మను వేడుకున్నాడు.

దూరం నుంచి రామనాథాన్ని గమనిస్తూ వుండిపోయిన నేను వాడి చర్యకు చకితుడినైనాను. వాడిని మనసులోనే అభినందించాను.

-:(సమాప్తం):-

*(రంజని-నందవాడ భీమారావు 'కథల పోటీ-2009లో తృతీయ బహుమతి పొందిన కథ 'ఆంధ్ర ప్రదేశ్' మాస పత్రికలో అగష్టు 2009 సంచికలో ప్రచురితం)*